**'సరిగా** రేపటికి వారం.' అశాంతిగా మంచం మీద అటూ ఇటూ పొర్లింది శారద. బలవంతంగా నిద్ర పోవాలని ప్రయత్నిస్తూ అనుకుంది. క్రిందటి శనివారం ఈపాటికంతా అయిపోయింది. చేతి కందిన మామిడి పండు కుళ్ళిపోయింది. నిర్మాణం ముగియకుండానే కూలిపోయిన వంతెనలా అయిపోయింది తన బ్రతుకు.

పొంగి వస్తున్న ఏడుపు ఆపుకుంటూ చక్రపాణి దగ్గరగా జరిగింది. రెండు చేతులూ భర్త మెడ చుట్టూ పోనిచ్చి ముఖం అతని ఎదలో దాచుకుంది. పాణికి అప్పుడే కునుకు పడుతూంది. శారద స్పర్శ మెలకువ తెచ్చింది. చెమ్మగా ఉన్న శారద చెంపలు అతని గుండెకు ఆనించేడు. ప్రేమగా, జాలిగా ఆమె ఉంగరాల జుట్టు నిమిరేడు.

'మరిచిపోవాలి, శారూ! మన చేతిలో ఏంలేదుగా!' అతని మాటలు అతనికే వినిపించనంత మెల్లగా అన్నాడు. అతను మాత్రం గట్టిగా ఏమనగలడు? శారద కెలాంటి బాధో అతనిదీ అలాంటి బాధే. ఆడది కనక బాహాటంగా ఏడ్చి గుండె బరువు దించేసుకోగల దామె. తాను అదీ చెయ్యలేక మంటల్ని మనసులో దాచేసుకుని - మామూలుగా తిరిగేస్తున్నాడు.

చక్రపాణి చెక్కిళ్ళమీదనుంచి శబ్దం చెయ్యకుండా జారిన కన్నీళ్ళు శారద కపోలాల్ని తాకేయి. జీరో బల్బు గుడ్డి వెలుగులో భర్త పడుతున్న వేదన గమనించిం దామె. పైట చెంగుతో అతని కన్నీళ్ళు తుడిచింది.

ఆలు మగలిద్దరూ నిలువు గుడ్లేసి నిశ్శబ్దంగానె ఒకరి నొకరు ఓదార్చుకున్నారు.

ఎవరో, ఎక్కడో మూలుగుతున్నట్లయింది. మంచంమీద లేచి కూర్చుంది శారద. పాణి మాత్రంకాదు. అతను నిద్రపోతున్నాడు. చెవులు రిక్కించి వింది. మళ్ళీ అదే శబ్దం.

మనిషి బాధతో మూలుగుతున్నట్లుగా ఎక్కడి నించో ధ్వని.

కర్మకాలి ఈ అడవుల్లో వచ్చి పడ్డాం. ఈ జంతువుల అరుపులూ, శబ్దాలూ విని విని మనం కూడా జంతువులుగా మారిపోతామో, ఏమో? అలా జరిగినా బాగుండును! నిస్సారంగా, అర్థ రహితంగా ఎంతకాలం బ్రతకాలో తనింకా! తన కళ్ళ వెలుగు—తన చిన్నారి కిష్టప్ప చచ్చిపోయేక తనింకా ఇలా ఎందుకు బ్రతకాలి?

ఆలోచించ లేకపోయింది శారద. పొర్లి వస్తున్న కన్నీళ్ళు తలగడలో నింపుతూ అలాగే మౌనంగా పడుకుని ఉండిపోయింది.

మళ్ళీ మూలిగేరు ఎవరో!

'ఎవ రబ్బా?' జాగ్రత్తగా విన్నది. ఏమీ వినిపించలేదు. భయంకర నిశ్శబ్దం అలుముకుంది ప్రపంచమంతటానూ. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ తీతువు పిట్ట కూత వినిపించింది.

'అబ్బ!'

అదిరిపోయిం దామె ఆ కూత విని. భయపడి పాణి దగ్గరగా జరిగింది. అతను మగత నిద్రలోనె ఆమెను రెండు చేతులతో బంధించి గుండెలో దాచేసుకున్నాడు.

మళ్ళీ గుడ్లగూబ అరుపు.

ఈసారి శారద భయపడలేదు. అలవాటు పడిన ధ్వనికి చెవులు నిగిడ్చింది.

దూరాన అడవిలోనుంచి పులి గాండ్రింపు వినిపించింది. మరుక్షణంలో ఎన్నో జంతువులు గాభరాగా అరుచుకుంటూ స్వజాతి జంతువులకు సంకేతా లిస్తున్నట్లు ఇరవై నిమిషాలపాటు పరుగులు పెట్టేయి. కాస్సేపట్లో వాటంతట అవే సద్దుమణిగిపోయేయి.

అలారం గడియారం టిక్కు టిక్కులు. నీరవ నిశ్శబ్దం. శారదకు నిద్ర పట్టడం లేదు. భరించ లేని కష్టాలతోబాటు ఈ కీకారణ్యంలో కాపురం కూడాను. కర్మ! ఏదో ఒకటి ఆలోచిద్దామని శారద మస్తిష్కం సిద్ధపడుతూండగా ఘాట్ నుంచి లారీలు దిగుతున్న చప్పుడు వినిపించింది. క్లీనర్ల కాషన్ కేకలు కూడా వినిపించేయి.

ఎన్ని కాషన్సు ఇచ్చినా రాత ఎవరూ తప్పించ లేరు. ప్రతి రోజూ ఒక్క లారీ అయినా ఘాట్‌లో ప్రమాదానికి గురి అవుతూంటూంది. లారీ డ్రైవర్లు దారలమ్మ కోవెలముందు ఆగి కొబ్బరికాయలు కొడుతూనే ఉంటారు. లారీలు బోల్తా పడుతూ ఉంటాయి. దారలమ్మ మాత్రం విధిని తప్పించకలదా? తప్పించ కలిగినదైతే తనెంత భక్తితో కొలిచిం దామెను? తనకేం జరిగింది! కడుపు శోకం మిగిలింది. శారద నీరసంగా అటూ ఇటూ దొర్లింది.

ఇంత దట్టమయిన అడవుల్లో ఆఫీసులు పెట్టకపోతే ప్రభుత్వం కుంటుపడిపోతుందా? ఏమిటో అంతుపట్టని ఆలోచనలు.

ఎక్కడ పుట్టేం? ఎక్కడ పెరిగేం?

ఇక్కడి కొచ్చి ఇలాంటి దురవస్థల పాలబడ్డాం. బ్రతుకంతా కటిక చీకటి మయం చేసుకున్నాం. వచ్చిన రోజు వెన్నెల పిండార పోసినట్లే ఉంది. కార్తీక పౌర్ణమినాటి చల్లటి వెన్నెల కాంతిలో తనూ, భర్త లారీ ముందు సీట్లో కూర్చుని ఈ దారకొండ అడవుల్లో ప్రవేశించేరు.

ఘాట్‌రోడ్డుకు రెండు వైపులా దట్టమైన అడవి. ఒక వైపున లోయలోను, మరొక వైపు కొండల మీదా పెరిగిన అడవి. రెండు వైపులా పేర్లు తెలియని పువ్వులు—సగంసగం విడుస్తూ పరిమళాలు వెదజల్లుతూంటే మత్తుగా కళ్ళుతెరుస్తూ, మూస్తూ ప్రకృతి పరిశీలించింది తను. ఆ ఎత్తు పల్లాల వంకర రోడ్డు మీద నింపాదిగా పోనిచ్చేడు డ్రైవరు. చిత్ర విచిత్రమైన జంతువులెన్నో కనిపించేయి.

రోడ్డు మీద అడ్డంగా నిర్లక్ష్యంగా పడుకున్న చిరుతలు, అటు అడవుల్లో నుంచి ఇటు లోయల్లోకి లారీ ముందు నుంచి మెరుపు తీగల్లా దూకే జింకలు, రక్తపు నోళ్ళతో వికృతపు ఆకారాలతో బారెడేసి కొమ్ములున్న అడవి గేదెలు—ఎన్నో, ఎన్నెన్నో చూసింది లారీ నడుస్తున్నంత సేపూ.

ఒక్కొక్క చోట అయితే రోడ్డు మీద భయం భీతీ లేకుండా పడుకుని ఉన్న పులికూనలు కనిపించాయి. అలాంటప్పుడు డ్రైవర్ షట్టర్సు వాళ్ళు వాటి మీద నుంచి లారీ పోనిస్తున్నట్లుగా హంగామా చేస్తుండేవాడు. అవి మెల్లగా లేచి బద్ధకంగా శరీరం విదిలించుకుని రక్తవర్ణపు నోళ్ళు తెరిచి రోడ్డు దాటి అడవుల్లోకి నడుస్తుంటే వింతగా, భయంగా చూస్తూ కూర్చుంది తను. సరిగ్గా పన్నెండు గంటల రాత్రివేళ ఆకాశంలో చందమామ పెద్ద సైజు పళ్ళెంలా ప్రకాశిస్తుండగా శారద—భర్తతో, లారీడు సామానుతో దారకొండ అడవుల్లో ప్రవేశించింది. దారకొండ శిఖరం నుంచి లారీ దిగుతూంటే వెన్నెల వెలుగులో పాతాళం చేరడానికి ఉరకలువేస్తూ దారకొండ ఊటధారగా రాళ్ళ మధ్య నుంచి క్రింద పడుతూంది.

"అదే దారలమ్మధార అంటారు. మనం కొండ దిగే సరికి ఈ ధార అక్కడ మడుగు కట్టి వాగులాగా ఏర్పడి ఉత్తరముఖంగా ప్రవహిస్తుంది. ఆ మడుగు దగ్గరే దారలమ్మ అనే అమ్మవారి గుడి ఉంది. గుడికి ఎడం వైపు మన కోసం ఏర్పరచిన క్వార్టర్సు ఉన్నాయి." చక్రపాణి చెప్తూకు పోతున్నాడు. శారద వినడం లేదు. ప్రకృతిలో లీనమయిపోయినట్లు మంత్ర ముగ్ధలా కూర్చుంది.

"ఏమ్ శారూ! ఏమి అలా వెర్రిగా చూస్తున్నావు?" అన్నాడు పాణి, ఆమె ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ.

దారలమ్మ ప్రవాహం —భగీరథ వంశీయుల్ని పునీతుల్ని చేయాలని, శివజటా జూటం మీదికి ఆకాశం చీల్చుకుని దుముకుతున్న గంగ లాగా ఉంది.

క్వార్టర్సులో కాలు పెడుతూనే మరోసారి అనుకుంది — 'అరణ్యవాసం వచ్చేంరా భగవంతుడా!' అని.

"తప్పదు మరి. ఫారెస్టాఫీసర్ని పెళ్ళాడేవుగా?" అన్నాడు పాణి, తన మనసులో మాట గ్రహించి.

ఇంతలో ఆఫీసు బంట్రోతులు లారీ సామాను దింపి క్వార్టర్సులో పెట్టేరు. రేంజరు రంగారావు వాళ్ళకు డైరెక్షన్సిచ్చి ఏ గది ఎలా ఉండాలో ఆ గది అలా సర్దించాడు.

"తమ రాక్కి డేటు తెలియజేస్తే నానే జీపు మీద తమర్ని తోలుకొచ్చేవాడ్ని. నారీ మాటైనా నారేమి?" అన్నాడు చేతులు కట్టుకుని జీపు డ్రైవరు పెడితల్లి.

పాణి ఫర్వాలేదన్నట్లుగా నవ్వి తన చెయ్యి పట్టుకుని సింహద్వారం దాటించి లోపల అడుగు పెట్టించాడు.

మరునాడు ఉదయం బద్ధకంగా నిద్ర లేచిన శారదకు పడక గది కిటికీ లోంచి కనపడింది జలపాతం.

'చాలా దగ్గరగానే ఉన్నాం ఈ జలపాతానికి' అనుకుంటూ నిత్యకృత్యాల్లో పడిపోయింది. అతి త్వరలో అక్కడి వాతావరణానికి అలవాటు పడి పోయింది తను

క్వార్టర్సు చుట్టూతా ఎత్తుగా ఉన్న రాతి
డలపై నించి ఘాట్ రోడ్డు మలుపులు
గుతూ కనిపిస్తుంది.

బస్సులు, లారీలు పరుగెడుతూంటే వాటి
ద్దాలు ఆలకిస్తూ, ఇంటిముందు అడ్డదిడ్డంగా
రిగిన గార్డెన్ సరిచేసింది. గులాబీలు రంగు
ర్చి రంగు పూలు పేర్చినట్లు కనిపించేలా
క్కలు నాటింది. కనకాంబరం దుబ్బులచుట్టూ
ట్టి చేమంతులు పెంచింది. సన్నజాజి తీగల్ని
దిరివిాదికి మళ్ళించింది. ఆట్టే ఉపయోగం
పోయినా, ఆకాశం చూస్తూ పెరిగే అంద
న గెలలు వేసే అడవి అరటిచెట్లు నాటిం
చింది. ప్రతి ఉదయం దారవాగులో స్నానం
దారలమ్మ దర్శనం చేసుకోవటం అలవాటు
కుంది. ప్రతి సాయంత్రం స్వేచ్ఛగా తోటలో
డుతున్న నెమళ్ళనూ, గంతులు వేస్తున్న కుందే
నూ నీరెండల కాంతిలో గంటలకొద్దీ చూసేది.
ఇక్కడి ప్రకృతి, ఈ చల్లని వాతావరణం
కసారిలో దారవాగులాటి ఉద్వేగం కలగ చేసేయి.
రుభూమి పరిప్లావితం అయింది. పెళ్ళయి
ని సంవత్సరాలుగా మాతృత్వం నోచుకోలేదని
మిలిపోతున్న శారద గర్భవతి అయింది.

"మా దారలమ్మ తల్లి చల్లగా చూసినాది.
న్నమి సెంద్రుణ్ణాటి బిడ్డడుట్టినాడు. పుట్టు
లాయమ్మ కిచ్చిండి" అంటూ పనిమనిషి
ంహాచలం, కిష్టప్పనెత్తుకుని ముద్దులాడింది.
ను మూడునెలల పిల్లవాణ్ణి ఎత్తుకుని ముద్దు
డింది.

జ్ఞాపకాల ఒత్తు గుబ్బాయిలో కళ్ళు చెమ
యి శారదకు. 'ఎప్పటికేం కన్నా! నా
ణానికి ప్రాణమైన నా బాబునే దారలమ్మకి
ర్పోసేను' అనుకుంది.

ఆలోచనలకు అడ్డుపడిన ఏడుపు ఆమె గొంతు
డ్డేసింది.

మళ్ళీ ఏదో మూలుగు.

'ఎవరబ్బా?' లేచి తలుపు తెరిచింది. డ్రాయింగ్
ంలో నవారు మంచంమీద పడుకున్న గంగ
శాంతిగా కదులుతూంది. మూలుగుతూ మధ్య
ధ్య అస్పష్టంగా ఏదో అంటూంది. ట్యూబ్
టు ఆన్‌చేసి, గంగ మంచం దగ్గరగా నడిచింది
రద.

పాపం! పసిది. ఒంటరిగా పడుకోలేక
మపడిందేమో?

"గంగా" నుదుటి మీద చెయ్యేసి చూసింది.
బ్బా! అట్లపెనంలా కాలిపోతోందే! చాలా
రమే ఉన్నట్లుంది.' కంగారుగా గంగను కుదిపి
కూర్చోపెట్టింది.

అసలే జ్వరం. అందునా నిద్రా భంగం.
చంమీద నిటారుగా కూర్చుని రాగం
కించుకుంది గంగ.

"ష్! మొద్దూ! ఊరుకో! అయ్యగారు
రు. బిస్కట్లు తింటావా!" కుడిచేత్తో
గ నోరు గట్టిగా మూసింది శారద.

"బిస్కట్లు తింటావా?"

"ఒద్దు. వుచ్చ పోసుకుంటాను." ఏడ్పు దిగ
మింగేసింది శారద.

"ఓసినీ!" అంత బాధలోనూ శారద పెదాల
మీద చిరునవ్వు మెరిసింది. గంగ రెండు
చంకల్లోనూ చేతులు పెట్టి మంచం దింపింది.
చెయ్యి పట్టుకుని బాత్‌రూముకు నడిపించింది.

"ఊ. పోసుకో."

"చడ్డీ లావట్లేదు. బిగిసిపోనాది."

శారద గంగ చడ్డీ విప్పింది. మళ్ళీ కట్టింది.
గోలెంలో నీళ్ళు ముంచి దాని కాళ్ళమీద పోసింది.
మెల్లగా నడిపించుకు వచ్చి మంచంమీద పండబెట్టి
దుప్పటి కప్పింది.

"బిస్కట్లు తింటావే, గంగా?" అలమర తెరిచి
డబ్బాలో బిస్కట్లు తీసి గంగ చేతి కందించింది.
"తిను." వెన్ను నిమురుతూ బుజ్జగించింది.

గంగ బిస్కట్ల కేసి చూస్తూ పడుకుంది.
కొరకలేదు.

పది నిమిషాల్లో దానికి నిద్ర పట్టింది.

గంగ అమాయకపు మొహం చూస్తూ, 'పాపం!
అమ్మంటే ఏమిటో ఎరగదు కదా?' అనుకుంది.

తను మాత్రం! అమ్మా అని కమ్మగా ఎంత
కాలం పిలిపించుకుంది కనక! పాలబుగ్గల బోసి
నవ్వు లింకా కళ్ళలో మెదులుతూనే ఉన్నాయి.
మోసం చేసి వెళ్ళిపోయాడు తన చిన్ని కిష్టప్ప.

అస్పష్టమైన ఆలోచనల మధ్య గుండె చెమరు
స్తూంటే నడుము లాగినట్లయి గంగ పక్కను
ఒరిగింది. గోడ కేసి తిరిగి పడుకున్న గంగను తన
వేపు తిప్పుకుంది. చెదిరిన దాని ముంగురులు సరి
దీసింది. జ్వరంతో వేడెక్కిన దాని ముంగురులు
మెత్తని బుగ్గల్ని తన చల్లని అరచేతితో రాసింది.

'మనిద్దరి దీ ఒక లాటి శనిగొట్టు జాతకమేనే,
గంగా! భూమి మీద పడగానే తల్లిని నువ్వు మింగే
శావ్! ఏడాది నిండకుండానే బిడ్డని నేను మింగేసేను.

శారదకు ఏడుపు పొంగి వచ్చింది. గంగను

# అమ్మలా అమ్మ

—రాయప్రోలు హైమ

"మంచి నీళ్ళిమ్మన్నావా?"

"వద్దు. నాకు బయం వేత్తోంది, అమ్మగారూ!
మీా లిక్కరే పలుకోలూ?" గంగ వచ్చీ రాని
మాటలు, దాని కళ్ళలో దైన్యం శారదను
కరిగించి వేసేయి. అప్రయత్నంగా గంగ మంచం
మీద కూర్చుంది. ఆమె చేయి ఆమెకే తెలియ
కుండా గంగను జోకొడుతూంటే 'పాపం పసిపిల్ల!'
అనుకుంది శారద.

గంగకు మగతగా నిద్ర పట్టింది. జ్వరం దిగి
నట్లు లేదు. దాని ఉచ్ఛ్వాస నిశ్వాసాల వేడికే శారదకు
చెమట పట్టింది. ఫాన్ వేద్దామనిలేస్తూంటే శారద
పైట కొంగు గంగ గట్టిగా పట్టుకుంది.

"అమ్మగారూ! నాకు భయం. ఇక్కలే పలు
క్కోంది." మళ్ళీ రాగం మొదలు పెట్టింది.

"ఫాన్ వేసి వస్తానే, పిచ్చిమొండా!" విడిపించుకుని
వెళ్ళి స్విచ్ నొక్కింది. మంచం మీద కూర్చుని
గోడకు చేరగిలబడి జోకొట్టింది గంగను.

గుండెకు హత్తుకుంది. శారద వక్షానికి గంగ
ముఖం తగలగానే ఆమెలో మాతృత్వం పొంగి
పొర్లింది. నిన్న మొన్నటి దాకా పసివాడికి పాలిచ్చిన
రొమ్ములు ఉబికి వచ్చాయి. జాకెట్టు పూర్తిగా
తడిసి పోయింది. చెప్పనలవి కాని అనుభూతి పొందింది.
గంగను గట్టిగా, మరింత గట్టిగా గుండెకు అదుము
కుంది.

'కుంటివాడు, గుడ్డివాడు గాలి గోపురం ఎక్కినట్లు
తల్లి లేని నువ్వూ, బిడ్డల్లేని నేనూ జీవయాత్ర
సాగిద్దామా, గంగా?' ఆర్ద్రంపుగా దాని కేసి చూస్తూ
అనుకుంది మనసులో.

'తమ్ముడా! మనం గుర్లం ఆత ఆలుకుందామా?'
గంగ కలవరిస్తూంది.

శారద మనసు ద్రవించి పోయింది. 'ఈ పిచ్చిదాని
కలల్లోకూడా నా చిన్ని కిష్టప్పే!'

'మరచిపోవే మొద్దూ! నన్ను చూడు—గుండె
బండరాయి చేసుకుని ఎలా ఉన్నానో. రా! నాతో

నువ్వూ, నీలో నేనూ ఇమిడిపోయి మనిద్దరి వేదనా మలగించి వేద్దాం.'

గంగను గట్టిగా, మరింత గట్టిగా కౌగిలిలోకి తీసుకుని దగ్గరగా, మరంత దగ్గరగా తన గుండెలో కంటూ దాన్ని ఇముడ్చుకుని నిద్ర పోయింది శారద.

● ● ●

"ఏయ్ శారూ! ఏమిటి ఇక్కడ పడుకున్నావ్?" తెల్లగా తెల్లారాక పాణి లేపితే సగం సగం లేస్తూ, "పాపం! దీనికి రాత్రంతా జ్వరమే నండీ!" అంది గంగకు దుప్పటి కప్పుతూ.

"అయితే మాత్రం? బొత్తిగా పక్కలో పండ బెట్టుకోవడ మేమిటి?"

అంతస్తుల అంతరాలు గుర్తు చేస్తూంది తని కంఠధ్వని.

శారద మనసు చివుక్కుమంది. మాతృత్వపు మధురిమ ముందు కులాల అడ్డుగోడలు, మతాల పట్టింపులు నిలబడ లేవని కొద్ది గంటల క్రితమే తన కర్థం అయింది. 'ఆయనకు కూడా అర్థం అయేలా చెయ్యాలి' అనుకుంది.

"ఏమండీ! మనం గంగని పెంచుకుంటే?" సూటిగా అడిగేసింది మనసులో మాట.

"గంగనా?" అదిరిపడ్డాడు పాణి.

"అవును. ఏం?"

"అది...పనిపిల్ల." ప్రతి అక్షరం ఒత్తి పలుకుతూ తన భావం భార్యకు స్పష్టం చేసేడు.

"పని పిల్లే. కాని, పసిపిల్ల. పైగా దిక్కు లేనిది." బ్రష్‌మీద పేస్టు వేసి భర్తకు అందిస్తూ తన నిర్ణయం తిరుగులేనిదని చెప్పక చెప్పింది శారద.

'అదే నా అభ్యంతరం, శారూ! నీకెలా చెప్పాలో తెలియకుండా ఉంది' అనుకుంటూ బాత్ రూములోకి నడిచేడు.

భార్య మనసు తెలియనివాడు కాదు అతను. అనాథలమీద జాలిలేని వాడూ కాదు. కాని, గంగను స్వంత బిడ్డగా అంగీకరించాలంటే మనసు ఇష్ట పడటం లేదు. దానిమీద అతనికి బోలెడు జాలి. తన చిన్ని కిష్టప్పకు తెచ్చినప్పుడల్లా దానికి కూడా బొమ్మలూ, కొత్త బట్టలూ తెస్తూనే ఉన్నాడు ఆరు నెలలుగా.

'అసలు తనేగా దాన్ని ఈ ఇంట్లోకి తెచ్చింది?' పళ్ళు తోముకుంటూ గతాన్ని తవ్వేడు పాణి.

కిష్టప్ప ఐదు నెలలు నిండకుండానే బోర్లా పడటం, బొజ్జమీద పాకటం నేర్చుకున్నాడు. శారద వాణ్ణి ఉయ్యాలలో పండబెట్టి వంటింట్లో పని చూసుకుంటూంటే ఊరుకునేవాడా! దుడుకు పిల్లడు. క్షణాని కోసారి చేవాడు. గుక్కపెట్టి ఏడ్చి శారదను ఉయ్యాల దగ్గరికి రప్పించి మరీ ఊరుకునేవాడు.

శారద తీరికలేకుండా పనిలో ఉంటే తను ఊయల ఊపవలసి వచ్చేది. అరగంట ఊపితే అయిదు నిమిషాలు నిద్రపోయేవాడు. చాలా సూక్ష్మ గ్రాహి వాడు. ఉయ్యాల స్పీడు కాస్త తగ్గగానే లేచి కూర్చునేవాడు. తనెన్నిసార్లు వాడి ఉయ్యాల మూలాన లేటయ్యేడు ఆఫీసుకు. శారద పాలు పొంగబెట్టి, అన్నం మాడ్చేస్తూండేది.

ఇది పనికాదని తనే అంట్లు తోమే సింహాచలానికి పురమాయించేడు — పాదస్తమానం ఇంటిదగ్గరే ఉండి కిష్టప్పను ఆడించే చిన్న పనిపిల్లను చూడమని.

"ఈ కాకుల్దారని కాలనిలో పనిపిల్ల లొదొరకరు గానండీ—నా మనవరా లున్నాది. ఏడేళ్ళ గుంట. బాబుని ఎత్తుకుని ఆడిపించగలు. ఉయ్యాలో పడకేసి ఊపగల్దు" అని మరునాడు పనిలోకి వస్తూ గంగను వెంట పెట్టుకుని వచ్చింది సింహాచలం.

చింపిరి జుట్టు. చీమిడి ముక్కు. పూటుగా గంజి తాగిన ముసలాడి పొట్టలా బానకడుపు. గంగను చూసి చీదరించుకుంది శారద.

"నాకొద్దు బాబోయ్, ఈ పిల్ల. దీని చేతుల మురికి అంటినా బంగారు తండ్రికి చిడుం పట్టేగల్దు" అంది గంగను చూసి అసహ్యించు కుంటూ.

"అలి గంతెల గమ్మా! మరింకెవళ్ళా దొరకరు గందా! రేపు దాన్నమ్మ తల్లి వాగులోన ముంచి తీసుకొస్తాన్లెండి. ఇయ్యాల్టి కిలా కానెండి."

గంగ పనిలో ప్రవేశించింది.

శారద దాన్ని చాలా ఏకాంగా చూసేది. చేతులు మురికిగా ఉన్నాయనేది. ఒంటి నిండా గౌను తొడుక్కోకుండా పనిలోకి రావద్దంది. సాటె సారెకూ "నీ చీడ పేలు నా బాబు తల్లో ఎక్కిస్తున్నావు ముండా" అని తిట్టేది.

తనెప్పుడయినా గంగను కసురుకున్నాడా? లేదు. పైగా పట్నం వెళ్ళినప్పుడు రెండు రెడీమేడ్ గౌన్లు కూడా తెచ్చి ఇచ్చేడు. రెండు జతల రిబ్బన్లు కొని ఇచ్చి, ప్రతిరోజూ దానికి శుభ్రంగా తల దువ్వి రెండు జడలు వెయ్యమని సింహాచలానికి చెప్పేడు.

కిష్టప్ప, గంగ గొప్ప ఫ్రెండ్స్ అయిపోయేరు. 'తమ్ముల్లా' అంటూ వరండా మీద గంగ పరుగులు పెడుతూంటే వాడు దాన్నందుకోవడానికి స్పీడుగా పాకేవాడు. గంగ బొమ్మరిల్లు లక్కపిడతలతో కట్టేది. వాడు దాన్ని చెల్లాచెదురు చేసేవాడు. వయసును మించిన బలంగా ఉన్న కిష్టప్పను చంక నేసుకుని తోటంతా తిప్పేది గంగ.

దాని అశుభ్రత ఏమాత్రం భరించలేకపోయేది శారద. ఒకసారి అది తల దువ్వుకోకుండా వచ్చి బాబును ఎత్తుకుంది. వెంటనే శారద వాణ్ణి లాగేసుకుని—

'చీ మురికిదానా? తల దువ్వుకోకుండా రేపటి నుంచి పనిలోకి రాకు' అని కసరి దాన్ని తరిమివేసింది.

"ఛ శారూ! మహాత్ముడు పుట్టిన దేశంలో పుట్టేం మనం." శారదను మెత్తగా మందలించేడు తను.

మరోసారి గంగ తోటలో చంటాణ్ణి ఎత్తుకుని పరుగులు పెడుతూ బోర్లా పడింది. ఇద్దరికీ రాళ్ళు గుచ్చుకున్నాయి. గంగ మోకాటి చిప్పలు గీరుకుని రక్తం చిందించేయి. ఇద్దరూ ఏక కంఠంతో ఇల్లెగిరిపోయేలా ఏడిచారు. శారద పరుగున వెళ్ళి కిష్టప్పను లేవదేసింది. 'నా తండ్రే! ఏడవకు నాయనా!' అని వాణ్ణి ఊరుకోబెడుతూ, 'పోవే గుడ్లగూబా! ఇం కెప్పుడూ మా ఇంటికి రాకు' అని గంగ రెక్కపట్టుకుని గేటు బయటికి గెంటేసింది.

గంగ ఎంతసేపు ఏడుస్తూ గేటు దగ్గర నిల బడిందో మరి! సాయంకాలం తను ఆఫీసునుంచి వస్తూ లోపలికి తీసుకు వచ్చేడు.

"పాపం! గంగను పొమ్మన్నావట! 'అమ్మ గారు తమ్ముణ్నెత్తుకోవద్దన్నారు' అని ఏడుస్తూంటే జాలేసి లోపలికి తీసుకువచ్చేను. దానికి మాత్రం దెబ్బలు తగలలేదూ? పిల్లలన్నాక ఎవరయినా ఒకటేగా, శారూ!"

శారద మాట్లాడలేదు.

మరోసారి గంగ గుబురు జుట్టులో చీడపీలు దువ్వమని హెచ్చరించింది సింహాచలాన్ని.

"నానేటి సెయ్యనమ్మ! నాకా కన్ను కావడను."

'పోనీ, వాళ్ళమ్మని దువ్వమను!'

"అ! దాని కమ్మనేదు. నాకు బాబు నేడు."

"ఏమిటీ! నీ కూతురు చచ్చిపోయిందా?"

"ఆది నాకెక్కడి కూతురమ్మా! అయిదేళ్ల పిల్లప్పుడు తునిలో దొరికినాది. ఎవ ర్నడిగినా మాపిల్ల కాదనేసినారు. దా న్నెత్తుకొని ఈ యడవుల్లోకి పొచ్చినాను. పదారేళ్ళు నిండకుండా ఎవడితో పాడు పనైసినాదో పాపిష్టి ముండ! నెల్తప్పినాది. కొట్టినా, కోసినా ఆడెవడో చెప్ప నాది కాదు. ఇల్లీగుంటని భూమ్మీ దొగ్గేసి సచ్చినాది."

శారద నోరు వెళ్ళబెట్టి వింది.

"అమ్మా! శారదమ్మగోరూ! కాటిక్కాళ్ళు సాచుక్కూకున్నాను. ఈ కుర్రదాని గతేమవుద్దో!" చిరిగిపోయిన చీరచెంగుతో కళ్ళు తుడుచుకుంది సింహాచలం.

హాయిగా తోటలో కిషప్పతో ఆడుకుంటున్న గంగవైపు జాలిగా చూసింది శారద.

ఆనాటినుంచి గంగను కసురుకోవడం మానేసింది. ఒకనాడు పనిగట్టుకుని గంగ తలలో పేలన్నీ ఏరి కుక్కి తలస్నానం చేయించింది. కిషప్పతోబాటు దానిక్కూడా వేణ్ణీళ్ళ స్నానం చేయించమని సింహాచలానికి పురమాయించింది. పెట్టెలోనే పిగిలిపోతున్న రెండు పాత పట్టుచీరలు తీసి దానికి గౌన్లు, పొట్టి లంగాలు తనే స్వయంగా మిషనుమీదకుట్టింది. కిష్టప్ప కిచ్చినప్పుడు గంగకుకూడా బిస్కట్లు, పంచదార పాలు ఇయ్యడం మొదలు పెట్టింది.

శారద సంకుచిత స్వభావం నశించి పోతున్నందుకు ఆనందించేడు చక్రపాణి.

పట్టుమని పదిరోజులు పాటలా జరిగిందంతే! ఈ ఘోరం జరిగిపోయింది.

తమ కళ్ళ వెలుగు చిన్నారి కిష్టప్ప కన్నుమూసేడు. పెద్దగా జబ్బు కూడా చెయ్యలేదు. రెండే రెండు రోజులపాటు విరేచనాలు వెళ్ళేయి. రెండవ రోజు మరీ ఎక్కువగా ఉండి పిల్లవాడు గుడ్లు తేలే స్తూంటే పెద్ద దిక్కు సింహాచలానికి కబురు పెట్టేరు దంపతులు. సింహాచలం పసివాడి ఉబ్బరించిన పొట్టకు ఆముదం రాసి కాపు పెట్టింది. అర్ధ రాత్రి దాకా బాబు పక్కనే ఉండి పరిచర్యలు చేసింది.

"పర్నేదు, బాబూ! దంతా లొస్తుంతె ఇలాగే ఇరోణాలు సేసుకుంతరు పిల్లలు. కుదురుకి కుంచెడు

నే చాయున్నావే గంగా! అదైర్యం పడకండి'' క్యం చెప్పి వెళ్ళిపోయింది సింహాచలం.

'తెల్లవారగానే బీపెక్కి వైజాగ్ కె. జి. హెచ్.కు పోవటమే' అనుకుంటూ నిద్ర పోయేడు పాణి. తెల్లవారనే లేదు. తను చిన్నాని సూర్యుడు మ ముక్కలుపోయేడు.

నిప్పులు, పెదబొబ్బలు, చుట్టాలు, పరా ర్థాలు..మామూలే! శారద తమ్ముడు దంపతు స్త్రీ తమతో రమ్మని బలవంతంచేసేరు కాని, రా లోకానికి మొహం చూపించాలని లేదన్న గా ఉండిపోయేరు.

''రుణమూ తీరినయొనక సెలవ్మైన నిమారా! ఆ బాబుకు మూడు అప్పు పడినారు. తీరంగానే పోనాడు. మీ రాయ అప్పుపడి ఉంటే మీ సరి కాలందాకా ఉండి తీర్చే ఓడు.

'మర్చిపో,అమ్మ! శారదమ్మగోరూ'' పక్షిణి నం చేసిన శారద జుట్టుకి సాంబ్రాణి పొగవేస్తూ రడించింది సింహాచలం.

శారద ఒంటరిగా ఏడుస్తూంది. పాణి ఒంటరిగా పస్తున్నాడు. మధ్య మధ్య ఇద్దరూ కలిసి ఏడు న్నారు.

గంగ బిక్కుబిక్కుమంటూ తిరుగుతూంది. ప్పు, తను ఆడుకునే వరండా మీద నాలుగు న్నా నోట్లో వేలిప్పు చూస్తూ నిలబడుతూంది. ో వెలితి అనుభవిస్తూంది కాని, ఏం చెప్పాలో యుని పసిపిల్ల కదా? నిద్ర లోమాత్రం మ్మలూ తమ్మలూ' అని కలవరిస్తూంది.

కాలం ఆగదుగా! వారం తిట్టే తిరిగి వచ్చింది. హాచలం క్రిందటి రోజు ఉదయం గంగని తెచ్చి రద దగ్గర వదలింది.

''ఒక్క వారం రోజులబాటు దీనికింత పడేసు ందు గదిలో పడుకోనీ, తల్లీ! దాని కంచం ఆది గేసుకుంటాది నెండి. నా తమ్ముడు గుర్రపువాతం కుని దర్మాసుపటల్లో సున్నాడంట. పోయి సొత్తాను. నా రుణం ఉంచుకోన్నేంది.''

గంగకు అప్పగింతలు పెట్టి ఘాట్‌రోడ్డులో బస్సు ఎక్కింది సింహాచలం.

ఆ క్షణం నుంచి శారద శ్రద్ధ అంతా గంగమీదే. నున్నగా దువ్వి రెండు జడలు వేసింది. కనకాంబ లు కోసి మాలం కట్టి, దాని జడలో తురిమింది. ట్లు తినిపించింది. పాలు తాగించింది. పగలంతా త్యలూ గంగతో గడిపిన శారదను చూసి పాణి సు తేలికపడింది.

'ఏదోవిధాన బాధ మరిచిపోతే చాలు' నను న్నాడు.

కాని, బొత్తిగా కులంలేని పిల్లను పక్కలో కోబెట్టుకోవటం లాటి ఔన్నత్యానికి మాత్రం ఎదగలేక పోతున్నాడు.

తలుపులనుంచీ,.. బాత్‌రూమునుంచి ఒకేసారి టట పడ్డాడు పాణి. ''శారదా! కాఫీ'' అంటూ. ద గంగచేత గ్లూకోజు నీళ్ళు తాగిస్తూంది. దాని చేతి కందించి వంటింట్లోకి వెళ్ళింది. డు కప్పులతో పొగలు కక్కే కాఫీ తెచ్చి ఒకటి కి అందించింది.

''అదికాదు, శారదా! నీకంతగా ఎవర్నయినా పెంచుకోవాలనుంటే మా తమ్ముడి కొడుకును తెచ్చుకుంటే ఎలా ఉంటుంది?'' సాలోచనగా భార్య కళ్ళలోకి చూసేడు.

శారద కాస్సేపు ఏమీ మాట్లాడలేదు.

''మీ తమ్ముడి కొడుక్కి రక్తం పంచి ఇచ్చిన అమ్మా, నాన్నా ఉన్నారు. పెంచుతారు. మనం ఈ దిక్కుమాలిన దానికి ప్రేమాను రాగాలు పంచి ఇద్దాం.''

శారద మాటలు ఆమె దృఢసంకల్పాన్ని ప్రతి అక్షరంలోనూ వ్యక్తం చేస్తున్నాయి. పాణి మౌనంగా కాఫీ గుటకలు వేసేడు.

''మన స్టేటస్ సంగతి కొంచెం ఆలోచించు. పైగా గంగ పుట్టుకకూడా అంత మంచిదికాదు.'' నీళ్ళు నమిలేడు.

"మానవత్వాన్ని మించిన స్టేటసేముందండీ! దాని పుట్టుక అంటారా? దాని తప్పేముంది? పాపం" శారద తడుముకోకుండా అనేసింది.

పాణి ఆలోచనలో పడ్డాడు. పుట్టుకతో ఎవరూ అపవిత్రులు కారు. తనకూ తెలుసు. కాని, చుట్టూ ఉన్న సమాజం మాట ఏమిటి? తను ఒక పెద్ద ఆఫీసరు. పదిమంది రేంజర్లు, పాతిక మందిదాకా ఫారెస్టు గార్డులు, ఇంకా ఇతర సిబ్బంది, చాలా మందీ మార్బలం ఉన్న ఈ దార కొండ ఫారెస్టు డిపార్టుమెంటుకు తను మకుటం లేని మహారాజు. పైగా తన అనుచరులకూ, సహచరులకూ గంగ తమ పనిపిల్లగానే తెలుసు. ఇప్పుడు దానిని దత్తు తీసుకుంటున్నామంటే నలుగురూ ఏమనుకుంటారు? ఎదుట 'ఆహా, ఓహో' అన్నా, వెనకాల వెక్కిరించకుండా ఉంటారా? తనకూ, శారదకూ వీరంతా ఇచ్చే ప్రత్యేక గౌరవం రేపు గంగకు ఇవ్వకపోతే తను భరించగలడా? పోనీ, అని వాళ్ళను శాసించగలడా?

శారదకు ఇవేమీ తెలియడం లేదు.

భర్త ఆలోచనలు గ్రహించింది శారద. అతని అసహాయత అర్థం చేసుకుంది. తన ఆవేదన అతను గ్రహిస్తే బాగుండును. సుడిగుండంలో చిక్కుకున్నవాడికి పూచికపుల్ల చేయూత లాగ, తనకు లభించిన గంగ పట్ల అతన్నే ఎలా సుముఖుణ్ణి చెయ్యాలో తోచలేదు. గుడ్లనీళ్ళు కుక్కుకుంటూ నిలబడింది.

'ఏమండీ! మన ఇంట్లో పెరుగుతున్న బుల్లి కుక్కపిల్లను ప్రేమిస్తారే. అడవిలో దొరికిన జింక కూనకు లేత గడ్డి పరకలు నోటి కందిస్తారే. గార్డెన్‌లో మల్లిపొదల్ని, మాలతుల్ని ప్రతిరోజూ పలకరిస్తారే! సాటి మానవ మాత్రురాలు అనాథ. పసికందు. గంగను గుండెలో దాచుకోలేరూ?!' మనసులోనే మథనపడుతూ కన్నీళ్ళు ఉడుచుకుంది శారద. ఖాళీ కాఫీ కప్పులతో శోకమూర్తిలా వంట ఇంట్లోకి వెడుతున్న భార్యను చూసి కరిగిపోయేడు పాణి.

గర్భశోకంతో కుమిలి పోతూంది. ఈమెను ఓదార్చవలసిన బాధ్యత తనకు ఉంది. చివాల్న లేచి వెళ్ళి గంగను మంచంమీదనుంచి లేవనెత్తేడు. చంకను ఎత్తుకుని అలమర తెరిచి ధర్మామీటరు తీసేడు. టెంపరేచరు నోట్‌చేసి మాత్ర మింగించేడు. శారదకు ఊరట కలిగించాలని దాన్నలాగే ఎత్తుకుని వంటింట్లోకి వెళ్ళేడు.

పొంగుతున్న పాలగిన్నె పట్టకారుతో దింపుతూ అలాగే కొయ్యబారి నిలబడిపోయింది శారద. పాణి చంకలో గంగను చూసి ఆనందం, ఆశ్చర్యం తళుక్ మన్నాయామె కళ్ళలో.

"శారూ! బాగా ఆలోచించు. ఈవేళ శనివారం. వచ్చే శనివారందాకా నీ ఈ నిర్ణయం ఇలాగే ఫర్మ్‌గా ఉంటే గంగను మనం దత్తు తీసుకుంటున్నట్లు ఇక్కడ ఆఫీసులో అందరికీ చెప్పి, ట్రాన్స్‌ఫర్‌కోసం పై అధికారులకు అప్లికేషన్ పంపుతాను."

ఆట్టే యాతన పడకుండానే భర్త అనుమతి ఇస్తున్నందుకు మురిసిపోయింది శారద. కాని, ట్రాన్స్‌ఫర్ ఎందుకబ్బా! ప్రశ్నార్థకంగా చూసింది.

"ఈ అడవి నుంచి మరో అడవికి పోతే.... ఎక్కడ ఎవరికీ దీని పుట్టుక రహస్యం తెలియదుగా? మన పిల్లే అని నమ్మి దీనికి సరి అయిన ఐడెంటిటీ ఇస్తారు."

"థాంక్సండీ!" ఇంచుమించు గర్జిస్తూ భర్త మాటలు మధ్యలోనే తుంచివేసింది.

"మంచికో, చెడ్డకో ధైర్యంగా అనుకున్నది చేసేడమే. ఎవరో ఏదో అంటారని ఎన్ని ఊళ్ళని మారగలం."

మరి మాట్లాడలేదు పాణి.

తరవాత వారమంతా శారద గంగ పట్ల అనురాగం పెంచుకుంది. చిందరవందరగా ఎదిగిన దాని ఉంగరాల జుట్టు చక్కగా షేవ్‌చేసి కత్తిరించింది. ప్రతి వారం వైజాగ్ వెళ్ళే మణి అయ్యరుకు డబ్బు ఇచ్చి మంచి మంచి గౌన్లు, బుల్లి జోళ్ళు కొని తెప్పించింది. సత్తు పళ్ళెంలో ఎడ్డిగా అన్నం తినే అలవాటు మానిపించి డైనింగ్ టేబిల్ మీద నీట్‌గా స్టీలు కంచంలో తినడం నేర్పింది.

దాని అడ్డ దిడ్డ యాస భాష మానిపించి చక్కగా మాట్లాడటం నేర్పటం మొదలుపెట్టింది. చిన్న పలక మీద ఓనమాలు దిద్దించటం కూడా ఏమరలేదు.

పాణి కిష్టప్ప దుస్తులు, బొమ్మలు తీసి అడుగు పెట్టెలో దాచేసేడు. మందు వేసిన వరి పొలంలాగా అందం పుంజుకుంటున్న గంగ నెత్తుకుని గార్డెన్‌లో తిరగటం అలవాటు చేసుకున్నాడు. నవ్వినప్పుడు సొట్టలు పడే గంగ నున్నటి బుగ్గలు చూసి 'నల్లనిదైనా చక్కనిదేస్మీ!' అనుకున్నాడు.

ఒక రోజు ఆఫీసులో అందరినీ పిలిచి చెప్పేశాడు.

"రేపాదివారం మీరంతా మా ఇంటికి భోజనానికి రావాలి. మేము గంగను దత్తు తీసుకుంటున్నాం."

"గంగనా?!" తెరిచిన నోరు తెరిచినట్టే కొయ్యబారి పోయేడు సీనియర్ రేంజి ఆఫీసర్ ఆనందరావు.

"అవునండీ! మా పిల్లవాడు పోయేక మా ఆవిడకది బాగా అలవాటు పడింది." నిర్లిప్తంగా అన్నాడు పాణి.

"కాదు కాని, సార్! మీకేమంత వయసు మించిపోయిందని దత్తు తీసుకోవటం? మళ్ళీ పిల్లలే పుట్టరా?" నసిగేడు గుమాస్తా మూర్తి.

"మా కా అవకాశం లేదు, మిస్టర్ మూర్తి! మా బాబు పుట్టినప్పుడు నా వైఫ్‌కు చాలా ప్రమాదం అయింది. మీకు తెలుసుకదా? మరోసారి పురుడు పోసుకుంటే నా శారద నాకు దక్కదని డాక్టర్లు భయపడితే నేనే ఆవిడ గర్భసంచీ ..." మరి చెప్పలేక పోయేడు పాణి! గొంతుకలో ఏడుపు అడ్డుకుంది.

"బాధపడకండి! జరిగింది మరిచిపోవాలి! కాని, మీరంతగా పెంచుకోవాలంటే మా వాళ్ళ కుర్రవాడు ఒకడున్నాడు. హి హి హి ... మీలా కళగా, శారదమ్మ గారిలా ఎర్రగా ..." టైపిస్టు సుబ్రహ్మణ్యం కళ్ళజోడు వెనక నుంచి స్వార్థం తొంగిచూసింది.

"మా వాళ్ళ కుర్రవాడూ ఉన్నాడు. స్వయానా నా తమ్ముడి కొడుకు."

గుడ్లు మిటకరించి చూశారంతా!

"కాని, ఇప్పుడీ అనాథ పిల్ల గంగ బాధ్యత మీ మీద పడింది కదా! మీకు తెలుసుగా— పోయిన శుక్రవారం తుని బస్సు ఘాట్‌లో బోల్తా కొట్టినప్పుడు బస్సుతోపాటు సింహాచలం తునాతునకలై పోయింది."

"కాని, పాణి గారూ! అనాథకు ఆశ్రయం కల్పించడానికి మనం కులం మతం పట్టించుకుంటామా?" వయసుతో ముదిరిన తెలివితేటలు ప్రదర్శించి ప్లేటు ఫిరాయించేడు సుబ్రహ్మణ్యం.

"నా కలాంటి వాటి మీద నమ్మకం లేదు. రేపాదివారం మీరంతా తప్పకుండా ఫామిలీస్‌తో సహా మా ఇంటికి లంచ్‌కి వస్తున్నారు." వారి జవాబుకోసం ఎదురు చూడకుండా బయటికి నడిచి జీపెక్కేడు పాణి.

గంగకు కలిసి వచ్చిన అదృష్టం దారకొండ గ్రామం అంతా పొగమంచులా వ్యాపించింది. మణి అయ్యరు పరుగున వచ్చి శారదను పొగిడేడు.

"రొంబనల్ల ఇరికిదమ్మా! మంచి పని చేస్తున్నారు. మురుగన్ మిమ్మల్ని నిండా మెచ్చుతాడు" అన్నాడు రెండు చేతులెత్తి శారదను ఆశీర్వదిస్తూ, తానే మురుగన్ అయినట్లుగా.

చాకలి సుబ్బి "గొప్పింట్లోళ్ళకి గొప్ప బుద్ధులే పుడతాయి. మా నాటోళ్ళం దిక్కులేని దాన్ని చేరదియ్యగలమా! పెంచగలమా!" అంది. అంతకంటే ఎలా శారద ఔన్నత్యం కొనియాడాలో దానికి తెలియలేదు.

"అమ్మా! బాగా ఆలోచించుకోండి! గంగ దరిద్రపుగొట్టుది. పుట్టగానే తల్లిని మింగేసినాది. దీని శని గొట్టు చేతుల్తో ఆర్నెల్లాడించినాదో, లేదో తమరి బాబుని మింగేసినాది. దీని కర్మ కాకపోతే అల్ల ముసల్ది కూడా బస్సు కూలి సచ్చిపోనాదే!"

'...డి తల్లీ!' ఒక పెడబొబ్బ పెట్టి జీపు డ్రైవరు నోరు మూయించింది శారద.

"ఇలాంటి మాటలు చెప్పి గంగ మీద నా మనసు విరిచెయ్యాలని ప్రయత్నించకు." గంగను చంకను వేసుకుని బిరబిరా హాల్లో నుండి పడకగది లోకి నడిచింది.

రెండుమూడు సార్లు 'మామ్మ ఎప్పుడొస్తుంది' అని బిక్క మొహం పెట్టింది గంగ. కాని, శారదలో పొంగిపొర్లుతున్న 'తల్లిప్రేమ' దాని బెంగను హతమార్చేసింది. నులక కుక్కి గోనె పక్క నుంచి ఫోమ్ బెడ్స్ మీద సుఖ నిద్రకు ఎదిగిపోయిన గంగ మెల మెల్లగా ముసలిదాన్ని మరిచిపోగింది. శారద చెప్తూ చేతల్లో ఒబ్బిడి, శుభ్రత నేర్చుకుంటూ, అమ్మగాలా, అయ్యగాలా అన్న పిలుపుమాని, 'మమ్మీ, డాడీ' అంటూంది శారదనూ, చక్రపాణినీ నెమ్మదిగా.

ఆరోజు శుక్రవారం. ఆదివారం చక్రపాణి దంపతులు గంగను దత్తు తీసుకొనే రోజు. దత్తు తీసుకోవడం అంటే కొత్త పేరు పెట్టడం. అన్న శాంతి చెయ్యడానికి అన్ని ఏర్పాట్లూ జరిగి

పోతున్నాయి. బంధువులకు ఆహ్వానాలు పంపేడు పాణి. మొక్కుబడి తీర్చుకుంటున్నట్లు అభినందనలు పంపేరు కొందరు. 'వంశ మెరిగి బిడ్డని తెచ్చుకోవాలి కాని, ఇదేం పని' అని తిడుతూ ఉత్తరాలు వ్రాసేరు కొందరు. శారద వాళ్ళు, తన వాళ్ళు కూడా తీవ్రమైన తమ. అసమ్మతిని తెలియజేసి వర్ణ సంకరం చేసిన వాళ్ళకు పుట్టగతులు ఉండవని బెదిరిస్తూ వ్రాసేరు.

బెదరలేదు పాణి. చెక్కు చెదరలేదు శారదకు గంగ మీద ఏర్పడిన మమకారం. ఉత్తరాలు చదవకుండానే టేబిల్ మీద పడేసి జీపెక్కి ఆనందరావు కొడుకు పుట్టిన రోజు పేరంటానికి వెళ్ళిపోయింది.

పేరంటాళ్ళు శారద చుట్టూ చేరేరు. కడుపు శోకం త్వరగానే మరిచిపోయిందని పైకి అభినందించినా, లోపల్లోపల ఎగతాళి చేసుకున్నారు.

"గంగను దత్తు తీసుకుంటున్నారటగా?" శారద కాళ్ళకు పసుపు పూస్తూ సందేహం వ్యక్తపరిచింది ఆనందరావు భార్య.

"మరేనండీ! ఆదివారంనాడే! తప్పక రావాలి స్మీ!" శారద హృదయ పూర్వకంగా ఆహ్వానించిం దామెను.

"అయ్యో! తప్పక వస్తాం! చాలా మంచిపని చేస్తున్నారు—సంతోషం."

అంతా నిర్ణయం అయిపోయాక ఇక ఆమె సంతోషించినా ఒకటే. ఆఘోరించినా ఒకటే.

"అక్షతలు ఇచ్చేనా?"

"ఇచ్చేరు! మా గంగకు కూడా పసుపు రాయాలండోయ్." గంగ మేజోళ్ళు విప్పింది శారద.

"దానికెందుకు లెద్దురూ! గౌను పాడు చేసుకుంటుంది." ఉపాయంగా తప్పించుకోబోయింది రావు గారి భార్య.

"మంచివారే. దానికి పసుపు చాలా ఇష్టం—రాయండి."

కావాలని ఆవిడ అలా చేస్తోందనిపించి నిలదీసిం దావిడ్ని. తన బిడ్డను తక్కువగా చూడటం ఏ తల్లి మాత్రం సహించగలదు! శారదకు కోపం వచ్చింది.

"శారదగారూ! మీకు తెలియనిదేముంది? ఆవేశంలో దాన్ని దత్తు తీసుకుంటున్నారు కాని, ముందు ముందు వాళ్ళమ్మ బుద్ధులే దానికీ వస్తే మీరే బాధపడిపోతారు. అదీ కాకుండా, శుక్రవారం మడిగా పూజ చేసుకున్న దాన్ని కదా? కులంలేని కులట కన్న పిల్ల కాళ్ళు ముట్టుకుని పసుపెలా రాయను? ఒక వేళ నేను రాసినా, రేపు నా చేతి వంట మా మామగారు తినకపోతే — ఆ ముసలి ప్రాణం ఉసురు పెట్టిన దాన్నయిపోనూ ..." బుగ్గలు నొక్కుకుంది మిసెస్ రావ్.

శారద చేష్టలు ఉడిగి విన్నది. క్షణంలోపల ఏమాలోచించుకుందో మరి, బిక్కచూపులుచూస్తూ తన చిటికెన వేలు పట్టుకుని నిలబడిన గంగను చంకను ఎత్తుకుని జీపెక్కి ఇంటికి వచ్చేసింది.


పాణి వరండా మీద వేలాడ దీసిన పంజరంలో మైనాకు గింజ లందిస్తున్నాడు. పది నిమిషాలు కాకుండా పేరంటానికి వెళ్ళిన శారద వచ్చెయ్యడమూ, ఆమె జేవురించిన కళ్ళూ చూసి అక్కడ ఏదో జరిగుంటుం దనుకున్నాడు.

జీపు దిగి సరాసరి భర్త దగ్గరికి నడిచింది శారద.

"ఏమండీ! మనం వెంటనే ఇక్కడి నించి ట్రాన్స్‌ఫర్ చేయించుకుందాం." మూగాం గొంతుతో అడిగింది పాణిని.

"ఎక్కడికి?"

"ఈ అడవి నుంచి మరో అడవికి! ఏ అడవిలో గంగకు నా పిల్లగా మాత్రం గుర్తింపు ఉంటుందో




ఆ అడవికి. ఏ అడవి పేరంటంలో నాతోబాటు నా బిడ్డకు కూడా పసుపు కుంకుమ అందుతాయో ఆ అడవికి వెళ్ళిపోదాం! అక్కడ మనం దీనికి కొత్త జన్మ ఇచ్చి, కొత్త పేరు పెడదాం." ఆవేశంతో వణికిపోతున్న పెదాల్ని అదిమిపెట్టి ఆ వరండా మీదే కూర్చుండి పోయింది శారద!

పాణికి విషయం తేటతెల్లమయింది.

గంగ చెయ్యి పట్టుకుని లోపలికి దారితీస్తూ, "సరే. ముందు ఇంట్లోకి నడు" అన్నాడు.

పాణికి పై వర్గాలలో ఉన్న పలుకుబడి వల్ల పది రోజులలో ట్రాన్స్‌ఫర్ ఆర్డరు చేతికి అందింది. రంపచోడవరం అడవులకు రేపే ప్రయాణం. పనివాళ్ళు సామాన్లను లారీలోకి నడుపుతున్నారు. కొద్ది క్షణాల్లో లారీ కదులుతుంది.

శారద గంగను ఎత్తుకుని వరండా మీద నిలబడింది. వెన్నెల పిండారపోసిన ట్లుంది. దారలమ్మధార మెరుస్తూ దివ్య కాంతి వెదజల్లుతూంది. చివరిసారిగా తన్మయురాలై చూసిందా జలపాతాన్ని శారద.

అప్రయత్నంగా ఆమె పళ్ళు గంగ బుగ్గను మెత్తగా కొరికేయి. కిలకిలలాడింది గంగ.

"రేపక్కడెవరయినా పేరేమిటని అడిగితే గంగ అని చెప్పకేం?"

గంగ చెవిలో గుసగుస లాడింది శారద.

"చెప్పను."

"నా పేరు శిరీష అని చెప్పు! ఏది 'శిరీష' అనూ."

"చిరీచ!"

"చి — కాదే మొద్దూ! 'శి 'శి'."

"చి చి!" గంగ నోటి తుంపరలు శారద ముఖం తడిపేశాయి, ఎండిపోయిన చేమంతి మొక్క మీద రాలిన మంచు బిందువుల్లా!

కిలకిలా నవ్వింది శారద — 'మొద్దూ' అంటూ పకపక లాడింది గంగ ఉరవ్ 'చిరీచ!'

శారద గంగను రెండు చేతులతోటీ పైకంటా ఎత్తింది. వెన్నెల వెలుగులో దాని కళ్ళు మెరిసేయి. ఆకాశంలో చందమామ వెన్న ముద్దలా కనిపించేడు. అదే! ఆ రోజున తను చల్లచేసి వెన్నముద్ద మజ్జిగ గిన్నెలో ఉంచి ఏదో పని చూసుకుంటూ ఉంటే చిన్న కిష్టప్ప పడదోసిన ఆ చల్లలో వెన్నముద్దలా!

గతంలోకి వద్దు అంటూన్నా పయనించే మనసు. "నా పేలు చి చి' ... అని గంగ అంటూండగా వర్తమానంలోకి వచ్చింది. మళ్ళీ దాని నోటి తుంపర్లు అచ్చం కిట్టప్ప పడదోసిన చల్ల చిందులులా—శారద ముఖం మీద పడ్డాయి.

లారీ హారన్ మ్రోగింది. ★